క్లుప్తంగా

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. దీనిలో భగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

పరవాడ: లంకెలపాలెం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.34 లక్షల చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు.

సీసీ, బీటీ రోడ్లకు శ్రీకారం



సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేశపాత్రుని పాలెంలో రూ.3.35 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ శేషాద్రి, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, వార్డు అధ్యక్షులు పిళ్లా శివకృష్ణ, మచ్చా శివకుమార్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్న, జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టిడ్కో కాలనీలో బోరు వేయండి'

పరవాడ: గొర్లివానిపాలెం టిడ్కో కాలనీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మంగళవారం వినతిపత్రం అందించారు. జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోందన్నారు. కాలనీలో బోరు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, సీత, మంగమ్మ, గోపాలరావు, రమాదేవి, లక్ష్మి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

పెదగంట్యాడ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న గడ్డం మేరీ సుజాతను మంగళవారం యారాడ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్న మేరీ సుజాత విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే విధంగా వారితో మొక్కలు నాటించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

సింహగిరిపై ట్రస్ట్ బోర్డ్ లేదు



- 15 నెలలు గడిచినా సింహాచలం దేవస్థాన ట్రస్ట్‌బోర్డు ఊసేలేదు
- దేవస్థానం పాలనా వ్యవహారాల్లో కొరవడిన పారదర్శకత, జవాబుదారీతనం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండుసార్లు ట్రస్ట్‌బోర్డు నియామకం
- దేవస్థానాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు సింహాచలేశుని దేవస్థాన పాలనా వ్యవహారాల్లో ట్రస్ట్ బోర్డు కీలకం. భక్తుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని, మెరుగైన సేవలందించడంలో బోర్డు సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. అధికారుల అడ్డగోలు ఆమోదాలకు అడ్డుకట్ట పడేది ట్రస్ట్ బోర్డు సమావేశాల్లోనేనంటే అతిశయోక్తి కాదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 మాసాలవుతున్నా.. ఇప్పటి వరకు ట్రస్ట్‌బోర్డు ఊసేలేదు. దీంతో పాలనావ్యవహారాలతో పాటు, ఇటీవల చోటుచేసుకున్న దుర్ఘటనల్లో అధికారులు, పాలకుల తీరు తేటతెల్లమైంది.

సింహాచలం: రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాల్లో సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఒకటి. దాదాపు 350 మంది పర్మినెంట్ ఉద్యోగులు, మరో 500 మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. 9 వేల ఎకరాలకు పైగా స్వామికి భూములు ఉన్నాయి. ఏడాదికి హుండీ ఆదాయం రూ.30 కోట్ల వరకు వస్తుంది. ఇంతటి ఘనత కలిగిన దేవస్థానానికి ట్రస్ట్‌బోర్డు నియామకం జరగలేదంటే విడ్డూరంగా ఉందని పలువురు చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ట్రస్ట్‌బోర్డు నియామకానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్వయానా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల చోటా నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

ఏకఛత్రాధిపత్యంగా...

గడిచిన 15 నెలలుగా ట్రస్ట్‌బోర్డు లేకపోవడంతో దేవస్థానం పాలన ఏకఛత్రాధిపత్యంగా సాగుతోంది. జవాబుదారీతనం, పారదర్శకత కొరవడింది. దేవస్థానంలో ఏ అభివృద్ధి పని చేయాలన్నా.. తొలుత దాన్ని ట్రస్ట్‌బోర్డు అనుమతికి పెట్టాలి. సభ్యులు చర్చించి ఆమోదం తెలపాలి. ఉత్సవాలు, లీజులు ఇతర పనుల జమాఖర్చులనూ ట్రస్ట్‌బోర్డు సమావేశంలో పెట్టాల్సి ఉంటుంది. వాటిపై అభ్యంతరాలుంటే అధికారుల్ని ప్రశ్నించే వీలుంటుంది. గత ప్రభుత్వంలో ట్రస్ట్‌బోర్డు సమావేశాల్లో అనేక అంశాలపై సభ్యులు తమ అభ్యంతరాలు తెలిపి, భక్తులకు మేలు జరిగేలా చూశారు. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజే కొనసాగుతుండటంతో ఆయన అనుమతితో అన్నింటినీ చక్కబెట్టేస్తున్నారు.

ట్రస్ట్‌బోర్డు ఉండుంటే..!

ఈ ఏడాది చందనోత్సవం రోజున సింహాచలం కొండపై మెట్లమార్గంలో గోడకూలి ఏడుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. దేవస్థాన చరిత్రలో ఇంతటి ఘోర ప్రమాదం ఎప్పుడూ జరగలేదు. చందనోత్సవానికి అతి కొద్ది రోజుల ముందే నాసిరకంగా గోడ నిర్మించడంతో దేవస్థానం, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఇంజినీర్లు కూడా సస్పెండ్ అయ్యారు. గతంలో ఉన్న మెట్లమార్గానికి విరుద్ధంగా, దేవస్థాన వైదికులు అభ్యంతరం చెప్తున్నా పట్టించుకోకుండా మెట్లు నిర్మించడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని ఘటన సమయంలో అంతా చెప్పుకున్నారు. అదే ట్రస్ట్‌బోర్డు ఉండి ఉంటే ఈ నిర్మాణంపై దృష్టి సారించేదని, వైదికుల అభిప్రాయాలను సమావేశంలో లేవనెత్తేదని పలువురి వాదన. ట్రస్ట్‌బోర్డు నియామకం చేపట్టకపోవడంతో ప్రశ్నించేవారే కరవై.. అధికారులదే పెత్తనమవుతోందన్న ఆక్షేపణలున్నాయి. ఇప్పటికైనా ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



2022 ఏప్రిల్ 7న రెండవసారి నియామకమైన ట్రస్ట్‌బోర్డు సభ్యులు





వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే 2020 మార్చి 5న ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్‌బోర్డు

వైఎస్సార్‌సీపీ హయాంలో రెండుసార్లు

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సింహాచలం దేవస్థానంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది తిరగకుండానే దేవస్థానానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. 2020 ఫిబ్రవరిలో ట్రస్ట్ బోర్డుని నియమించగా అదే ఏడాది మార్చి 5న ట్రస్ట్‌బోర్డు సభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు. ఆ బోర్డు గడువు రెండేళ్లలో ముగిసింది. దీంతో 2022 ఏప్రిల్‌లో రెండవసారి ట్రస్ట్‌బోర్డుని ఏర్పాటు చేశారు. అదే నెల 7న ట్రస్ట్‌బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ బోర్డు కాలపరిమితి 2024 ఏప్రిల్‌తో ముగిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రస్ట్‌బోర్డు ఊసే లేదు.

మాట నిలబెట్టుకున్న జగన్



అధికారంలోకి రాగానే సింహాచలం దేవస్థానానికి ట్రస్ట్‌బోర్డుని ఏర్పాటుచేసి అప్పటి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారు. 2020 ఫిబ్రవరిలో ఏర్పాటైన బోర్డులో నేను కూడా ఓ సభ్యుడిని. మా బోర్డు కాలపరిమితి ముగిసిన వెంటనే రెండవసారి కూడా బోర్డుని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

– సూరిశెట్టి సూరిబాబు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు

ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారధిలాంటివారు



దేవాలయాల్లో ట్రస్ట్‌బోర్డు సభ్యులంటే అధికారులకు, భక్తులకు మధ్య వారధిలాంటివారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయడంలో, అభివృద్ధి పనుల్లో పారదర్శకత, అవినీతి జరగకుండా చూడటంలో కీలకంగా వ్యవహరిస్తారు. బోర్డు అనేది లేకపోతే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారు. గడిచిన చందనోత్సవంలో జరిగిన గోడ ప్రమాదానికి ఎవరు బాధ్యులంటే.. ఇప్పటికీ సరైన సమాధానం లేదు. 2022లో ఏర్పాటైన రెండవ బోర్డులో నేనొక సభ్యురాలిని కావడం గర్వంగా ఉంది.

– పెనుమత్స శ్రీదేవివర్మ, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు

అప్పన్న సన్నిధిలో సినీ హీరో బెల్లంకొండ



సింహగిరిపై సినీ హీరో బెల్లకొండ శ్రీనివాస్‌తో సెల్ఫీ దిగుతున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ నెల12న విడుదలవుతున్న కిష్కిందపురి సినిమా విజయవంతం కావాలని స్వామిని కోరుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింహగిరిపై పలువురు భక్తులు శ్రీనివాస్‌ను కలిసి ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

అన్నదాత పోరుకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



98వ వార్డు అప్పన్నపాలెం నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి 93, 98వ వార్డుల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అనకాపల్లి తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు పీతల విష్ణుమూర్తి, జగదీష్, నోళ్ల శ్రీను, పైడిరాజు, గణేష్, శ్రీను, 93వ వార్డు నుంచి దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, కనకరాజు, చంద్రరావు, వెంకటేష్, గోవింద్, సూరిబాబు, హరిప్రసాద్, నక్క రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల గృహనిర్బంధం అన్యాయం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఇంటి వద్ద కాపలాగా ఉన్న పోలీసులు



మొగలిపురంలోని నివాసంలో గండి రవికుమార్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీస్‌లు



సబ్బవరంలోని గృహంలో పోలీసుల నిర్బంధంలో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు

పరవాడ: అన్నదాతల తరఫున పోరాటం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేయడం, గృహనిర్బంధంలోకి తీసుకోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు మండిపడ్డారు. పరవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నదాతకు అండగా నిలవడానికి అనకాపల్లిలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లకుండా మండల వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటాలను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోందని, అందుకే తమ పార్టీ నేతలను గృహనిర్బంధం చేస్తోందని ఆక్షేపించారు. బ్లాక్ మార్కెట్ ద్వారా ఎరువులను అమ్మకాలు సాగిస్తూ కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. దీన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, బదులు చెప్పే రోజు వస్తుందని పేర్కొన్నారు.

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరుకు పార్టీ నేతలు వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంది. ఇందులో భాగంగా మండలంలోని పలువురు పార్టీ నేతలను ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననీయకుండా పోలీసుల సాయంతో గృహ నిర్బంధాలు చేయించింది. పార్టీ సీనియర్ నాయకుడు గండి రవి కుమార్, మండల కన్వీనర్ కర్రి బాబు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు తదితరులను మంగళవారం వేకువజాము నుంచి వారి ఇంటి వద్దే పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

'ఉద్యమ్ ఆధార్ నమోదు తప్పనిసరి'



వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రోత్సాహక అధికారి త్రివేణి

సబ్బవరం: వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలతో పాటు సేవారంగ కార్యక్రమాలు నిర్వహించే సభ్యులు ఉద్యమ్ అధార్ నమోదు తప్పనిసరగా చేసుకోవాలని పరిశ్రమల ప్రోత్సాహక అధికారి ఎస్.త్రివేణి తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య డీఆర్‌డీఏ–వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ్ ఆధార్ నమోదుపై మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి రుణాలు, ఇతర ప్రోత్సాహకాల కోసం ప్రతి వ్యాపార, సేవా, ఉత్పత్తి రంగాల్లో ఉన్నవారికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో 54 మంది సభ్యులకు ఉద్యమ్ నమోదు చేయించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు

సబ్బవరం: ఈ నెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో వైద్య సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే మండలంలో 16,250 డోస్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కోళ్లకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.150కే లింగ నిర్ధారణ వీర్యం గురించి పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కిసాన్ క్రెడిట్ లోన్స్ కోసం కనీసం 5 దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సమీక్షలో స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ వి.చిట్టినాయుడు, పశు వైద్యాధికారులు డా.స్వర్ణలత, డా.అరుణ, డా.సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికులది ఆకలి పోరాటం

అగనంపూడి: సినర్జీస్ కార్మికులు చేసేది సమ్మె కాదని, ఆకలి పోరాటమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బూసి వెంకటరావు అన్నారు. ఐదు రోజులుగా దువ్వాడలో సినర్జీస్ కార్మికులు కొనసాగిస్తున్న ఆందోళన కార్యక్రమానికి మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఆరు మాసాలు జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను పస్తులకు గురిచేస్తున్న యాజమాన్యం తీరు సరికాదన్నారు. కంపెనీ చట్టం 447 ప్రకారం జీతాలు చెల్లించకపోవడం ఆర్థిక మోసం, దగాగా భావించి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆకలి కేకలు కూటమి ప్రభుత్వ పెద్దలకు వినపడడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను కోత విధిస్తున్నా ఆయా ఖాతాలకు జమచేయకుండా మింగేయడం వల్ల కార్మికులు తీరని నష్టానికి గురవుతున్నారన్నారు.యాజమాన్యం దిగిరాకపోతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్మికుల ప్రతినిధులు ఎ.దాస్, బి.రమణ, ఉదయ్‌కుమార్, బషీర్, పి.ఆనంద్, ఎం.శ్రీనివాస్, సుదర్శనరావు పాల్గొన్నారు.

అలరించిన మ్యాజిక్ షో



ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న రవిశంకర్

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సింహాచలం ప్రాంతానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజాలికుడు రవిశంకర్ పలు రకాల ప్రదర్శనలతో అబ్బురపరిచారు. కాలనీలోని చిన్నారులు, నివాసితులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనను తిలకించారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలని వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతి పత్రం అందిస్తున్న ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు

పరవాడ: ఊటగెడ్డ కూడలి-వాడచీపురుపల్లి రహదారికి మరమ్మతులు చేపట్టాలని సింహాద్రి ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు బొండా భీమరాజు, ప్రధాన కార్యదర్శి ఎంజీపీ లెనిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రమేష్‌బాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఊటగెడ్డ కూడలి నుంచి దీపాంజలినగర్ వరకు రోడ్డంతా గోతులమయంగా మారడంతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నట్లు వివరించారు. రాత్రి వేళ వాహనచోదకులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. రహదారిని పునరుద్ధరించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మహేష్, బొండా రామారావు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



బురదమయంగా రావాడ-ధర్మారాయుడుపేట రోడ్డు

కనీస మరమ్మతులూ చేపట్టట్లేదని ప్రజల ఆవేదన

పరవాడ: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారడంతో పల్లె ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగుచేస్తామని ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడంతో గుంతల రోడ్లలతో ఇబ్బందులు తప్పట్లేదని పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం-పాతరాజన్నపాలెం రోడ్డు మరమ్మతులకు గుర్రైనా పట్టించుకునే నాథుడు లేక ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండున్నర కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. కనీసం పాదచారులు రాకపోకలు సాగించడానికి కూడా వీల్లేని దుస్థితికి చేరింది. రోడ్డు మరమ్మతులకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా కనీస ప్రయోజనమూ కనిపించట్లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



గుంతలమయంగా మారిన మెట్టపాలెం రోడ్డు

రావాడ-ధర్మారాయుడుపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన మెటల్ రోడ్డు అధ్వాన స్థితికి చేరడంతో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ మాత్రం వర్షం పడినా రోడ్డంతా నీరు చేరి బురదమయంగా మారుతోంది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై రాకపోకలు కష్టతరంగా ఉన్నాయని వాపోతున్నారు. పూర్తిగా ఛిద్రమైన ఈ రహదారిలో పంట ఫలసాయాలను ఇళ్లకు తరలించుకోవడం దుర్లభంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో రావాడ-ధర్మారాయుడుపేట, రావాడ-బొట్టవానిపాలెం రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గురుకుల ఉపాధ్యాయునికి పురస్కారం



రాంబాబును సత్కరిస్తున్న గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఫిజికల్ సైన్స్ టీజీటీ డాక్టర్ టి.రాంబాబుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కింది. విజయవాడలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ చేతుల మీదగా మంగళవారం అయన్ని సత్కరించి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ సిబ్బందితో కలిసి అభినందనలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com